కథ

# బోన్సైల్లో హృదయం

**సుగంధ శ్రీనివాస్**

**ఆ మాటలు వింటూనే ఆశ్చర్యపోయాను!**

**"...కానీ ఈ విషయం మనిద్దరి మధ్యే ఉండాలి. నీకన్నీ తెల్సుండీ కూడా ఈ పని చేయడం నాకేం నచ్చడం లేదు. నేనసలు పెళ్ళే చేసుకోనని ఎంత మొండికేసినా అమ్మ చచ్చిపోతానని బెదిరించడం వల్ల ఇలా ఒప్పుకోవాల్సి వచ్చింది. ఈ క్షణం నుండి భార్యగా నటించడం నీ జీవితమవుతుంది. నాపై కలలు మాత్రం కనకు. కొందరి జీవితాలు కురవని మేఘాలు. వాటిని కరిగించి మొలకెత్తాలనుకోవడం తెలిసి తెలిసి సమయాన్ని వృర్థం చేసుకోవడమే!" కన్నార్పకుండా చూస్తూ అన్నాడు.**

''ఈ విషం లాంటి విషయాన్ని నువ్వే భరిస్తావో, తలా కొంత పంచుతావో నీ ఇష్టానికే ఒదిలేస్తున్నా'' కాస్త దూరంలో క్రింద ఒక దుప్పటి పరిచి దిండును తలకాన్చుకుని కళ్ళు మూసుకున్నాడు.

'బావా! పెళ్ళంటే తెలీని వయసులోనే నువ్వే కావాలనుకున్నాను. ఎలాగోలా నిన్ను గెలుచుకున్నాను. ఆ గెలుపు నా ఓటమైంది. నువ్వే కావాలనుకున్నప్పుడు మరెన్నింటినో వదిలేసుకోవాలి. అందులో ఈ జీవితమొకటి. నా మనసుకు గొంతున్నా, నీ గొంతుకు మనసున్నా ఎంత బావుండు?!' అనుకున్నాన్నేను.

నేనింకా నిలబడే ఉండటం చూసి ''మనిద్దరిలో ఎవరు నటించడంలో ఫెయిలైనా మన మధ్య ఈమాత్రం సం'బంధం' ఉండటం కష్టం. అందుకే ఈరోజు నీ జీవితంలో అతి మామూలు రాత్రనుకుని నిద్రపో'' అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

చెక్కి పడేసిన శిల్పం మాదిరి కదలకుండా బెడ్‌పై కూర్చుండిపోయా. కళ్ళ ముందు శూన్యం. చెవుల్లో హోరు. మనసు మొత్తం ధూపం.

తలతిప్పి అటోసారి చూశాను. తన రగిలే మనసులో, పొగిలే గుండెలో నా స్థానం లేదనిపించేలా కనబడ్డాడు. ఒక్కో జ్ఞాపకం..కంటి రెప్పలపై బరువుగా రాలుతూ నిద్రను వాలనివ్వడం లేదు కళ్ళపై. అది మా శోభనం రాత్రి.

★ ★ ★

వారం రోజులు ఎలా గడిచాయో బాగానే నటించాం అక్కడ. ఊటూర్ నుండి కరీంనగర్ వచ్చి రెండు రోజులవుతోంది.

అవసరానికి మాటలు, ఏమాత్రం 'టచ్' లేకుండా చక్కగా కాపురం చేస్తున్నాం. తను పదింటికి ఆఫీసుకెళ్ళినవాడు ఆరింటికి తిరిగి వస్తాడు.

తనెళ్ళాక దినపత్రిక నుండి మాసపత్రిక వరకు చదివింది విపులంగా చదువుతూ రోజులను ఏరిపారేస్తున్నాన్నేను. కొత్త కావడం చేత ఇంకా ఎవరూ పరిచయం కాలేదు. ఎక్కడ కాపురం 'ముచ్చట్లు' అడుగుతారోని కూడా చొరవ చూపించలేకపోతున్నా.

ఆ రోజు ఆదివారం. నాక్కాస్త ఆసక్తి కల్గింది ఈ రోజంతా ఇంట్లోనే ఉంటాడు కదాని..! నేను వంటింట్లో ఉన్నాను. బనియన్ కనిపించడంలేదంటూ వచ్చి నుంచున్నాడు. తల పచ్చిగానే ఉంది. ఆ ఛాతిపై ఉన్న టవల్ నా పార్టీకి చెందినట్లుంది. వెంట్రుకల్లో దాగిన నీటి బిందువులు ముత్యాలనిపించేలా కనబడుతున్నాయ్. తనతో పాటే బీరువా దగ్గరికి చేరుకున్నాను. నిజమే! నా బట్టల్తో ఉందది. తీసి చేతికిచ్చాను. తీసుకోవడానికన్నట్లు చేయి చాచి టవల్ వదిలేశాడు. అంతే! నిలువెత్తు విగ్రహం. నిండైన బంగారు రంగు ఛాతి. ఒక్క క్షణం చూశాను. ఒళ్ళు ఝల్లుమంది. గిర్రున అటు తిరిగి తడబడుతున్న అడుగులతో వచ్చేశా.

అదే దృశ్యం కళ్ళనిండా! మగవాళ్ళు కూడా ఇంత అందంగా ఉంటారా?! ఒక్కసారి ఒకే ఒక్కసారి ఆ గుండెని ముద్దుపెట్టుకుంటే..నవ్వొస్తోంది. కలలు కనొద్దని చెప్పాడుగా.

''నువ్వూ కూర్చో'' అన్నాడు వడ్డిస్తుంటే. ఎదురుగా కూర్చోబోతుండగా ''మనసు దృఢంగా ఉంటే ఏ క్షణమూ బలహీనమైంది కాబోదు..'' ఇప్పుడు జరిగిన సంఘటనను ద్దేశించి కావచ్చు అన్నాడు.

''బాధనిపిస్తోంది కదూ! నీపై నాకెలాంటి కోపమూ, ద్వేషమూ లేదు. నిజానికి ఏ భావమూ లేదు. ఎందుకిలా కావాలని జీవితాన్ని స్పాయిల్ చేసుకున్నావ్?''

అది ప్రశ్నే! నన్ను మాట్లాడించడానికా?!

నా మౌనం తనకేమనిపించిందో? మరేమీ అడగలేదు.

సాయంత్రం జాజులు కోసుకుంటుండగా ''ఏంటీ..కోపమా? మాట్లాడితే నీ ముల్లేం పోయింది?'' అంటున్నాడు తను కూడా పూలు తెంపుతూ.

పరిపరివిధాల చక్రభ్రమణం చేస్తున్న మనసు చప్పున ఆగిపోయింది.

''చూడు! నన్నొక బాధ వెంటాడుతోంది. నా మూలంగా నీకేమైనా ఇబ్బంది కల్గుతోందాని? అంతకంటే మూడీగా ఉండడం నాకూ చేతనవును మరి. ఏదైనా మాట్లాడవా?'' ఆసక్తిగా అడిగాడు.

'ఏం మాట్లాడడం..?' గుండె నిండా పరుచుకునున్న బావతో! నటనే నా బ్రతుకవుతుందని చెప్పి..మాట్లాడమంటున్నాడు చూడు. నాకు తెల్సు. బావ ఎవరినో ప్రేమించాడని. పెళ్ళిదాకా వెళ్ళిన వారి ప్రేమను ఏ బలహీనతో ఓడించింది. ఒక రకంగా బావను ఆమె మోసం చేసింది పిరికితనంతో. ఈ విషయం ఇంట్లోనూ తెల్సు. తెల్సినా నేను పట్టుపట్టి బావనే కట్టుకున్నాను. గెలిచాను! బావను భర్తగా పొందడమే లక్ష్యంగా ఎన్నని ఎదురు చూపులు..అవన్నీ నిజమయ్యాయి. తనెవరినో ప్రేమిస్తున్నాడని తెలిసినప్పుడు నిలదీసి అడగాలనుకున్నా. కానీ ఏదో నన్నాపింది. నాకు బయటి సంబంధాలు చూస్తూంటే బావకే తప్ప మరెవ్వరికీ ఛాన్స్ ఇవ్వనని ఎంత తెగింపు మాటలు! వాటికెన్ని చివాట్లు!

అయినా నాకీ జీవితం బాధగా లేదు. కారణం తనని చూస్తూ...తనని తాకిన గాలి నన్ను తాకితే చాలని ఎన్ని రాత్రులు కలల రాసులు కూర్చలేదు?! ఇప్పుడిదంతా బోనసే! బావను నేను ఆరాధించాను. ఊహ తెలియక ముందు నుండే ప్రేమించాను. ప్రాణంగా ప్రేమించాను! అలాంటి బావను నేనెందుకు వదులుకుంటాను?!

ఆయన్నాకర్షించడానికి నేనేం చవకబారు వేషాలేయడం లేదు. మాట్లాడడమే తక్కువ. ఈ



జీవితం ఇలాగే ఉంటుందనుకోను. మార్పు మనిషికైనా, మనసుకైనా, మరేదానికైనా సహజమని నమ్మేదాన్ని. అందని జాబిలి ఒళ్లో వాలుతుంది. రాలని పూవ్వు పెదవిపై విరుస్తుంది.

''మౌనంగా ఉండడమంటే అంతిష్టమా?'' బావ కళ్ళెత్తి నన్నే చూస్తున్నాడు.

సిగ్గనిపించింది. చిరునవ్వు మొగ్గను చివరకంటూ తుంచి మామూలైపోయా. పాపం! ఎంత ప్రయత్నించినా నా గొంతు స్పందించడం లేదు.

''మనసులో ఏముందో తెలుసుకోకుండా మాట్లాడమనడం..వెర్రితనం'' అని చిన్నబోయిన ముఖంతో ఇంట్లోకి నడిచాడు.

★ ★ ★

రోజులను నెలలు చేయడంలో ఆరి తేరాను. ఒక యంత్రంలా మారిపోయాను. మరే కోరికలు లేని మనిషిలా మారాను. నిజంగా బావ చాలా గ్రేట్. ఎంత 'నిజాయితీ'గా ఉంటున్నాడు. కనీసం తాకడానిక్కూడా అవకాశం లేకుండా ప్రవర్తిస్తాడు. నా అందం అతన్ని ఏమాత్రం గతి తప్పించడం లేదు.

రాత్రి పడక సిద్ధం చేసుకుంటున్నాను.

''రేపు గుడికెళ్దాం..'' అన్నాడు గుమ్మం దగ్గరి నుండే! నమ్మలేదు. ఎక్కడా దేవుని ప్రస్తావన తేడుకదా బావ. ఆలోచనలకందని ప్రవర్తన అని నవ్వుకున్నాను.

గాలితో ముంగురులు ఆడుకుంటున్నాయి. నాతో నా ఆలోచనలు. గుడిలోకి వెళుతూ కొబ్బరికాయ, పూలు కొనుక్కొని వచ్చాడు.

''ఈరోజు శ్రావణి పుట్టిన రోజు'' అంటూ నా చేతిలో పెట్టాడు. అర్థమైంది. నా ఆశ్చర్యం తన కంటబడనీయకుండా ముందుకు నడిచాను.

పూజారి పేరేంటని అడగ్గా ''శ్రావణి'' అన్నాడు. ''మీ పేరు'' అని తిరిగి అడిగితే ''ఒక్కరిదే చేయించండి'' అని ముక్తసరిగా చెప్పాడు బావ. పూజారి నన్ను ఓసారి పరీక్షగా చూసి తన పని కానిచ్చాడు.

బావ ఇంకా శ్రావణిని మరవలేకపోతున్నాడు! ఇలా ఎన్నాళ్ళుంటాడు?!

ఇంటికొచ్చాక పాయసం చేశాను.

''ఆనందంగా అమృతం ఆరగించడానికి 'తను' నా సొంతం కాలేదు'' అంటూ పాయసం పక్కకు నెట్టాడు.

''అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే మనుషులకు దేవుడితో పని గానీ, కళ్ళకు కన్నీటి అవసరం గాని ఉండేవి కావు. పువ్వు నా కొప్పుకు పూయలేదని ఆ రెమ్మను ద్వేషించకూడదు'' పాయసం వంటింట్లోకి తీసుకెళుతూ మనసుకు గొంతిచ్చాను. అంతే! అవాక్కైపోయాడు. కళ్ళింత చేసుకుని నన్నే చూస్తున్నాడు బావ. 'మరి లేకపోతే ఎంతకని భరించేది?!' కోపం నిజంగానే వచ్చేసింది.

ఏమీ తినకనే ఆఫీసుకెళ్ళిపోయాడు. నేనూ తినకనే ఇంట్లో ఉండిపోయాను.

కళ్ళు కన్నీళ్ళతో నిండగా ఇందు గుర్తొచ్చింది. అవును ఎలా గడిపాం ఆ రోజులను! నా ప్రతి కదలికనీ మాటనీ ఆరాధించే నా నెచ్చెలి.

తనంటుండేది..''అవునటే హరితా! నేనబ్బాయినైతే ఎంత బావుండే. నీలాంటి అమ్మాయికి భర్తనయ్యా..ఆ బ్రహ్మకు ఏమొచ్చిందే నన్ను మగాడిగా పుట్టిస్తే...!''

''ఆపుతావా!'' నా వార్నింగుకు భయపడి ఆగిపోయేది. బావపై నా ఇష్టం, ప్రేమ, ఆశ, ఆరాధన సమస్తం తెల్సు. హెచ్చరించేది కూడా. ఎదుటివారెవరైనా సరే మనపై కంటే ఎక్కువ ఆశలు వాళ్ళపై పెట్టుకోవద్దని. అయినా దాని ఫిలాసఫీ దానిది. నా ఆరాధన నాది. ఉత్తరం రాయడం ప్రారంభించా ఇందుకి- మనసును అక్షరాలుగా మలిచి.

★ ★ ★

పూల చెట్లకు నీళ్ళు జల్లుతుంటే వచ్చాడు. ఉదయం తాలూకు మరక ఇంకా చెరిగిపోలేదనుకునేలా..నీరసంగానే కనబడ్డాడు.

పని కానిచ్చేసి ''కాఫీ..'' అడిగాను. సమాధానం రాకపోయేసరికి ''కాఫీ తేనా'' మళ్ళీ అడిగాను నేనే.


తలెత్తి చూసి ''వద్దు. తల నొప్పిగా ఉంది'' అంటూ కళ్ళు ఇంకాస్త గట్టిగా మూసుకున్నాడు. ఎందుకో కాసేపయ్యాక కళ్ళు తెరిచాడు. ఆయన్నే చూస్తున్నా కొంచెం బాధగా.

''బామ్ రాయనా..''

తల అడ్డంగా ఊపుతూ కళ్ళు మూసుకున్నాడు.

## అంకితభావం

**నటనలో ఎన్ని మైలురాళ్ళు అధిగమించినా జీవితంలో ఇంకా ఏదో సాధించాలని ఉంటుంది. తమకి ఇష్టమైన వ్యక్తుల్ని జీవితాంతం జ్ఞాపకం ఉంచుకునేలా ఏదైనా చేయాలనుకోవడం సహజం. లగాన్ హీరో అమీర్‌ఖాన్ గుర్తున్నాడా? తాను నటిస్తున్న 'ది రైజింగ్ వండర్' చిత్ర నిర్మాతలనుంచి తనకి రావాల్సిన పారితోషికాన్ని ముందే తీసేసుకోవాలనుకుంటున్నాడట అతను. అలా తీసుకున్న ఏడుకోట్లతో ప్రముఖ సంగీత దర్శకుడు బాబా అజ్మీతో కలిసి ఓ ఆల్బమ్ రూపొందించాలనుకుంటున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ఆల్బమ్‌ని కైఫీ అజ్మీకి అంకితం ఇవ్వాలనుకుంటున్నాడట. అమీర్ అంకితభావం ఇతర నటులకి ఎలాంటి స్ఫూర్తినిస్తుందో చూద్దాం.**



నుదురుపై నా చేయి పడగానే అదిరిపడి చూశాడు. మౌనంగా నా పని కానిస్తున్నాను. తననలా స్పృశించడం అదే మొదలు. తల వేడిగా ఉంది నిజమే.

అలా తనపై వంగినప్పుడు నా పమిట, నా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు తన్ని తాకుతున్నాయి. రాస్తుంటే హాయిగానే ఉన్నా ఏమనుకున్నాడో- ''ఇక చాలు..థాంక్స్'' అని కళ్ళు తెరిచాడు. ఎందుకు కళ్ళల్లో నిండాయో నీళ్ళు ఇద్దరికీ. కళ్ళు కళ్ళు కలిసినా ఆ మసకలో గుర్తించలేదు కన్నీళ్ళను.

''నీకంత నిస్తేజంగా ఇక్కడనిపిస్తే వెళ్ళొచ్చు'' భోజనం చేసి వీక్లీ చదువుతూ నేను పుట్టింటికెళ్ళొస్తానన్న మాటకి సమాధానం ఇచ్చాడు.

''అది కాదు. అమ్మను చూడాలనిపిస్తోంది'' నెమ్మదిగా చెప్పాన్నేను.

కొన్ని నిమిషాలాగి..''సరే'' అన్నాడు నన్నే చూస్తూ.

★ ★ ★

ఆనవాయితీ అయితే ఇద్దరం కల్సి వెళ్ళాల్సింది. కానీ తానెలాగూ రాడు. ఎలాగైనా మానేజ్ చేయాలనుకుంటూ ఇల్లు చేరుకున్నాను.

అమ్మ ఎదురొచ్చింది, ఇంకెవరి కోసమో వెనక్కి చూస్తూ ఆగిపోయింది.

''తను రాలేదు పనుండి'' అంటూ ఇంట్లోకి నడిచా నవ్వుతూ.

నా నటనా కౌశలాన్ని ప్రదర్శిస్తూ అందరినీ నమ్మించా..బాగా చూసుకుంటున్నాడని. కానీ పక్కింటి సుజాత వదినకు మాత్రం దొరికిపోయాను.

''ఇదన్నమాట సంగతి'' అంటూ దీర్ఘాలు తీసింది. ''నీకు బాగానే ఓపిక ఉందిలే పిల్లా- కావాలని కోరుకుని చేసుకున్నావ్‌గా నిరీక్షించు'' అంది. నేను నవ్వుతూ తన్నే చూస్తున్నాను.

ఇందు తర్వాత ఈమే నా బెస్ట్ ఫ్రెండ్. చాలా మంచిది. ఎదుటివారి మనసును చదవడం తెల్సిన మనిషి.

''సరేగానీ- మీ ఆయన నిన్నేమని పిలుస్తాడోయ్?''

''ఏమనడు''

''పోనీ..నువ్వేమని పిలుస్తావోయ్?'' తల విగరేసింది.

అడ్డంగా తలూపాను.

''మీ ఆయన మీద నీ అభిప్రాయం సాధ్యమైనంత పెద్దదిగా చెప్పు చూద్దాం'' అంది ముసిముసిగా నవ్వుతూ.

క్షణమాగి ''మా వారు....'' అంటూ తల పక్కకి తిప్పుతూంటే.

''సిగ్గుపడడానికి ఏం జరిగిందని...'' చెప్పమంటూ బుగ్గగిల్లింది.

''...మా వాసు చాలా సెన్సిటివ్ అండ్ సిన్సియర్. నీకు తెల్సుగా రూపురేఖలు, అందచందాలు. కన్నెపిల్ల చూసిందంటే కలలు కనడం ఖాయం. ఏ వ్యసనాలు లేవు. ఆ కళ్ళు..ఆ నవ్వు..ఆ మనసు..మనలాంటివారికైతే అసూయ పుట్టిస్తాయ్. తను నా వాడని గుర్తుకొచ్చినప్పుడల్లా ఎంత సంతోషమేస్తుందో?!'' అంటూ ఆగాను.

వదిన నా తల నిమురుతూ..''పిచ్చిపిల్లా! నువ్వెంత అమాయకురాలివి. బంగారం కావాల్సినంత చెంతనే ఉంచుకుని ఏ ఆభరణం ధరించకుండా ఎలా ఉంటున్నావ్ చూడు. మనసు విప్పి మాట్లాడడు. కంటినిండా చూడనే చూడడు. తాకడానికి అర్హతలేనట్లు యంత్రంలా ప్రక్కనే ఉన్నా నువ్వెంతగా తనను ప్రేమిస్తున్నావ్?! అన్నీ సమకూర్చే భర్తలనే ఈ కాలం భార్యలు ఇంకా వేధించుకుతింటుంటే, నీకూ వారికి తేడా ఆయనకి ఎప్పుడు తెలుస్తుందో ఏమో!''

వదిన కళ్ళల్లో నీళ్ళు పొరలు. నాకూ పరుచుకున్నాయి.

ఎవరికీ చెప్పొద్దని మాట తీసుకుని ఇంట్లోకొచ్చాను.

★ ★ ★

''తెల్లారితే నీ పుట్టినరోజు కదే!'' అంటూ ఉండమంది అమ్మ.

బావకి వంట చేసుకోవడం రాదని, నన్ను చూడకుండా ఉండలేడని అబద్ధం చెప్పి, ఈ పుట్టినరోజుకు తనతోనే ఉండాలని ఇంట్లోంచి బయ

టపడ్డాను. నిజం చెప్పాలంటే నాకే బావను చూడాలనిపించింది.

సాయంత్రమైంది. ఇంట్లోనే ఉన్నాడు బావ. గుమ్మంలో అడుగుపెట్టానో లేదో... సువాసన గుప్పుమంటూ వస్తోంది. బ్యాగ్ అక్కడ పెట్టేసి కిచెన్ వైపునడిచా.

అప్పుడే స్నానం చేసినట్లు కడిగిన ముత్యంలా కనబడుతున్నాడు. కాఫీ కప్పు, ఫ్లాస్కుతో వెనక్కి తిరిగాడు నిమిషం గడిచాక.

అంతే! కళ్ళలో ఆశ్చర్యం, ముఖంపై క్షణకాలం సంతోషం ఒకేసారి తళుక్కుమన్నాయ్!

వంట తానే చేశాడు. నాకయితే అంతా ఆశ్చర్యమే! నలుడికి శిష్యుడేమో రుచిగానే ఉంది.

రాత్రి ఎవరి తపస్సులో వారు లీనమై ఉండగా తనే- ''ఉదయం గుడికెళ్దాం'' అంటూ నన్నే చూస్తున్నాడు.

''నేనెందుకు?'' అనలేదు. తలెత్తి చూశానంతే!

పూజ ముగిశాక మెట్ల మీద ప్రక్క ప్రక్కనే కూర్చున్నాం. కళ్ళింత లోతుకు పోయి ఉన్నాయి. రాత్రి బావ నిద్రపోలేదని ఇట్టే తెలుస్తోంది.

''...నాపై కోపం రావడం లేదా నీకు?'' అన్నాడు.

ఏ అక్షరమూ లేని తెల్ల కాగితంలా నా ముఖం భావరహితంగా పెట్టాను.

ఓ నిముషం గడిచాక ''హరీ..'' అన్నాడు.

తొలకరి చినుకులు మీద రాల్చినట్టు ఒళ్ళంతా పులకరించిపోయింది. ఆ తన్మయత్వం బహుశా నా జీవితంలో అప్పటి వరకు అనుభవించి ఉండను. మనసుకు చక్కిలిగింతలు పెట్టినట్లు. ఇన్నాళ్ళ మా అనుబంధంలో తొలిసారిగా గుండె గదులు తోసుకుని వచ్చిన పిలుపది.

మడత విప్పని కాగితమొకటి చేతిలో పెట్టాడు- అలాగే చూస్తున్న నాకు అది ఇందుకి నేను రాసిన ఉత్తరమే. పోస్టు చేయడం మరిచిపోయాను. అందులో ఏముందో నాకు తెలీకపోతే కదా! అయినా కళ్ళు అక్షరాల వెంట పరుగుదీశాయి.

''ఇష్టసఖీ ఇందుకి...

నీకు తెలుసా- నా జీవితంలో బావను పెళ్ళి చేసుకోవడం ఒక మధుర స్వప్నం. దాని కోసం నేనెన్నాళ్ళు పరితపించాను! కలలు కలబోశాను!

పెళ్ళి వరకు నిజమే జరిగింది. అయితే మా మధ్య కొలవలేనంత దూరం. కలుపలేనంత ఎడబాటు.

నేను బావను ప్రేమించాను. బావ మరొకరిని ప్రేమించాడు. బావ నాకు అందాడు. బావకు 'ఆమె' చెందలేదు. మేమిద్దరం భార్యాభర్తల్లా గడుపుతున్నాం..జీవించడం లేదు. ఎన్ని ఆశలల్లుకున్నాను. ఎన్ని ఊసులు పూసగుచ్చాను. ఎన్ని సిగ్గులు దాచుకున్నాను. ఇవన్నీ..ఇవన్నీ ఏవి?! నేననుకున్నదంతా భ్రమ.

ఆయన్ని ప్రతి క్షణం నా ఒడిలో ఊహించుకుని ఎన్నో రాత్రులు దాటాను.

తనో సారన్నాడు- మనసు దృఢంగా ఉన్నంత కాలం ఏ క్షణం బలహీనమైంది కాదట. మరోసారంటాడు. వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు మూర్ఖంగా జీవితాన్ని అర్పించుకోరని. ఇవన్నీ నాకేం బాధ కల్గించలేదు. నేను బావను ప్రేమించా. ఆరాధించా. ఇంకా అంతకంటే ఎక్కువ ఏదైనా ఉంటే అది చేశా.

కన్నీళ్ళతో బ్రతిమిలాడను. పరువంతో వల వేయను. అవకాశం కోసం వేచి చూడను. ఇలాగే బ్రతకగలను. కొందరు ప్రేమకోసం ఏదేదో త్యాగం చేస్తూంటారు. నేను నా జీవితాన్నే అలా చేస్తే తప్పేముంది. అదే నాకు తృప్తయినప్పుడు? ప్రేమించిన వారి కోసం నడవమని హృదయాన్ని పరిస్తే వారికది ఒక్కోసారి విసుగనిపిస్తుంది కదూ. బావ ఏనాటికైనా నావాడే! అవును. ఏదో ఒక రోజు నేను ఆ అదృష్టవంతురాల్ని కానా? చెప్పు..ఆశ గుడ్డిదైనా..మూగదైనా మన శ్వాసే కదూ...!''

తలవంచుకుని అలాగే కూర్చున్నా.

బావ నోరు విప్పాడు. ''ఇతరుల ఉత్తరాలు చదవకూడదు. అయినా చదివినందుకు నన్ను క్షమించు. ప్రేయసి కోసం నా జీవితాన్నిలాగే గడపగలను. నన్ను నేనే దూరం చేసుకుని 'నేను' లేని నన్ను భరిస్తూ ఎన్నాళ్ళైనా ఉండగలనేమో కానీ నువ్వేం నేరం చేశావ్? నా వల్ల నీకెందుకీ శిక్ష? నా ప్రియురాలు దూరమైందని ఆ కోపం నీపై ఎందుకు చూపించాలి?''

నాకైతే అంతా అయోమయం. గొంతు మాట్లాడుతుందన్న విషయం మరిచిపోయానన్నట్లు చూస్తున్నాను.




''గడిచిపోయినదాన్ని బాగు చేయలేక... ముందున్నదాన్ని పూర్తి చేయలేక రోజులు జారవిడవడమా జీవితమంటే? భవిష్యత్ గూర్చి కలలెన్నో కంటాం కానీ అన్నీ నిజమవుతాయా? అనుకున్నది అందలేదని జీవితాన్ని గాలికొదిలేస్తే పలాయనవాదమవుతుంది. కొన్ని జీవితాలు ఎప్పటికీ చిగురించవని-చుట్టూ వున్నవాళ్ళకి నీడనివ్వకుంటే ఎలా?!

నేను ప్రేమించాను. చేరువకాలేకపోయాను. నువ్వు ప్రేమించావ్..చేరువగానే ఉన్నా 'దూరం' తీరానివయ్యావ్. నా ప్రేమలో స్వార్థముంది. కానీ నీ ప్రేమలో స్వచ్ఛమైన ఆరాధన ఉంది'' ఆగాడు.

నాకు గుండె ఆగిపోతుందేమోనన్నంతగా ఉద్వేగంగా ఉంది.

''నువ్వే గెలుస్తున్నావ్. నీ ప్రేమే గెలుస్తోంది'' అంటూ దోసిట్లో పట్టుకున్నాడు ఓ గులాబి పువ్వును.

గుడి గంటలు, భక్తిగీతాలు, పరిమళ ప్రశాంతత ఇవన్నీ లేనట్లే 'నిశబ్దం' నేనైపోయా. కళ్ళనే కాదు నన్ను నేనే నమ్మలేకపోతున్నా.

ఆ చూపులు వెన్నెల వెలుగులా నాపై జాలువారుతున్నాయి. ఆ కళ్ళలో నా రూపం స్పష్టంగా కన్నీటి నిలువుటద్దాల్లో మెరుస్తూ.

తల్లో పెట్టమన్నట్లుగా వెనక్కి తిరిగా.

మెడను తాకీ తాకనట్లు తాకుతూ నా తలలో తన హృదయం ఎంత సుతారంగా అమర్చుతున్నాడో-ఆ పారవశ్యంతో కళ్ళు మూసుకున్నాడు. పెదాలు ఎప్పటిలాగే ఆ పదాలు ఉచ్చరించాయ్.

''ఏంటీ?! నువ్వే ఏదో గుసగుసగా..! చెప్పవా?''

''ఊహు..'' అన్నాను కళ్ళతో నవ్వుతూ.

''చెప్పవా..'' నిలువునా కరిగించే చూపుతో మళ్ళీ అడిగాడు.

''ఇంటికెళ్ళాక..'' అంటూ చేయి పట్టుకున్నాను.

ద్వారం దాటుతూ అప్రయత్నంగా కనులు వెనక్కి తిరిగి గుడిలోకి చూశాయి. ఆ రోజు నా పుట్టిన రోజని బావకు తెలీదు.

వేదమంత్రాలు, భక్తిగీతాలు, గుడిగంటలు, నా గుండెచప్పుళ్ళు అన్నీ..అన్నీ..వినిపిస్తూనే ఉన్నాయి. ఈ సందడికి తప్పిపోతానన్నట్లుగా ఇంకాస్త గట్టిగా పట్టుకున్నాను మావారి చేతిని..''వాసూ ఐ లవ్ యూ'' అని వినబడకుండా అంటూ.

✤